నడిచేదెలా?

- ఫుట్‌పాత్‌లపై దర్జాగా వ్యాపారాలు
- సర్వీసు రోడ్లనూ వదలని వైనం
- అవస్థలు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు


జింక్ సేవా మార్గంపై కూరగాయల దుకాణాలు


గాజువాక ఆర్టీసీ డిపో ఎదురుగా ఫుట్‌పాత్‌పై దుకాణం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లు, సర్వీసురోడ్లు వాణిజ్య కేంద్రాలుగా మారుతున్నాయి. కొందరు కూటమి నేతల అండదండలతో ఫుట్‌పాత్‌లను వాణిజ్య కేంద్రాలుగా మార్చేస్తున్నారు. దీంతో వారిని చూసి మరికొందరు తామేమీ తక్కువ కాదని దుకాణాలను వదిలి ఫుట్‌పాత్‌లు, సర్వీసు రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఆ మార్గాన వచ్చే పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

గాజువాక ఆర్టీసీ డిపో ఎదురుగా గల పాతచెక్‌పోస్టు ఏరియా వద్ద జీవీఎంసీ అధికారులు సుమారు రూ.12 లక్షల వ్యయంతో ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పాదచారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు, స్థానికులు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా ఫుట్‌పాత్ నిర్మించారు. నాలుగు అడుగుల వెడల్పుతో పాతచెక్‌పోస్టు ఏరియా నుంచి జింక్ వరకు రెండు వైపులా వేశారు. ప్రారంభంలో స్థానికులు రాకపోకలు హాయిగా సాగించేవారు. తర్వాత ఫుట్‌పాత్‌లను ఆనుకుని ఉన్న పలువురు దుకాణదారులు ఫుత్‌పాత్‌లను ఆక్రమించడం ప్రారంభించారు. అలా ఒకరిని చూసి మరొకరు దర్జాగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి తమ వ్యాపారాలు సాగిస్తున్నారు.

జింక్ వద్ద సర్వీసు రోడ్డు ఆక్రమించి ..

జింక్ మలుపు వద్ద గాజువాక ఆర్టీసీ డిపో వైపు వచ్చే మార్గంలో పలువురు పండ్లు, కూరగాయల వ్యాపారులు సర్వీసు రోడ్డును ఆక్రమించి తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీని వల్ల పాదచారులు,వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది.దీంతో సమయానికి కార్యాలయాలు, ఇళ్లకు చేరుకోలేక ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

ఫిర్యాదు చేసినా...



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఫుట్‌పాత్‌పై నడిచేందుకు దారి ఉండదు. ఇక్కడ ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురి కావడమే సమస్యకు కారణం.దీనిపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం.నేటికీ ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

– ఆకుల కనకరాజు, పాదచారు

సాయంత్రం వేళ తప్పకోలేం



జింక్ మలుపు వద్ద సాయంత్రం సమయంలో తప్పుకోలేని విధంగా ఉంటుంది.ఇక్కడ సేవా మార్గంలో పలువురు వ్యాపారులు ముందుకు వచ్చి వ్యాపారాలు సాగించడం వల్లే ఈ పరిస్థితి. కొనుగోలు దారులు వారి వాహనాలను సర్వీసురోడ్డులో నిలపడం, దుకాణాల వద్ద గుమిగూడడంతో సాయంత్రం వేళ వాహనాలు తప్పుకోలేని పరిస్థితి ఉంటుంది.

– నమ్మిడి రాజు, వాహనదారు

గ్రీన్‌బెల్ట్ కబ్జాపై కదిలిన అధికారులు


మొక్కలు నాటేందుకు పోసిన ఎర్రమట్టి

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌ఏడీకి వచ్చే హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోనున్నట్లు జీవీఎంసీ అధికారులు వెల్లడించారు. 'గ్రీన్‌బెల్ట్ కబ్జా' అనే శీర్షికన ఈ నెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో జీవీఎంసీ అధికారులు కదిలారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఉద్యానవన విభాగ అధికారులు కాకానినగర్ వద్ద హైవేకు ఆనుకొని ఉన్న ఆక్రమిత ప్రదేశాన్ని పరిశీలించారు. ఎనిమిదేళ్ల కిందట నాటిన 6 చెట్లను సమీప ఇంటి యజమాని నరికినట్లు అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. చెట్లు తొలగించి శుభ్రం చేసిన ప్రదేశంలో 15 రోజుల్లోగా మళ్లీ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సదరు ఇంటి యజమానికి ఆదేశించారు. ఇందుకు అతను అంగీకరించాడని.. అలా కాని పక్షంలో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేస్తామని జీవీఎంసీ అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

హక్కుల రక్షణకు యువత ఉద్యమించాలి


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మల్కాపురం: రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణకు యువత ఉద్యమించాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి అన్నారు.గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యుత్తమ రాజ్యాంగం భారత రాజ్యాంగం అని అన్నారు. మన రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్, 12 షెడ్యూల్స్ ఉన్నాయన్నారు. పలు కళాశాలల విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాస రచన పోటీలను గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రాగ్రాం అధికారి భాగ్యలక్ష్మి వ్యవహరించారు.

కీర్తి పట్నాయక్‌కు సత్కారం


కీర్తిపట్నాయక్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: తన ట్రస్టు ద్వారా నిరుపేదలు, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ కుప్పిలి కీర్తిపట్నాయక్‌ను సోమవారం పారిశ్రామిక ప్రాంత శిష్టకరణం అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సాగర్‌దుర్గా బీచ్‌లో సంఘం అధ్యక్షుడు,ప్రముఖ న్యాయవాది ఎన్.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు జి.గౌరీశంకర్, గజపతిరావు తదితరులు పాల్గొని కీర్తిపట్నాయక్‌కు శాలువ కప్పి,జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

అపార్ కష్టాలపై ప్రత్యేక దృష్టి సారించండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

విశాఖ విద్య : అపార్ కార్డుల జారీ ప్రక్రియలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సాంకేతిక ఇబ్బందులను సత్వరమే పరిష్కరించేలా శ్రద్ధ తీసుకోవాలని కోరుతూ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు లేఖ రాసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అపార్ పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.

పోస్టు కార్డు ఉద్యమంలో మేము సైతం


ఉక్కునగరంలో జరిగిన పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న మహిళలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రారంభించిన పోస్టు కార్డు ఉద్యమంలో సోమవారం ఉక్కునగరం మహిళలు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ పిలుపు మేరకు జరుగుతున్న 10 లక్షల పోస్టు కార్డుల ఉద్యమం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు చేస్తున్న ఉద్యమానికి సోమవారం ఉక్కునగరం మహిళలు మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపివేయాలంటూ పోస్టు కార్డులపై మహిళలు సంతకాలు చేశారు. ఈనెల 27న పాత పోస్టాఫీసు వరకు నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొంటామని ప్రకటించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం కూడలి వద్ద డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలనే సందేశాన్ని నటన ద్వారా చూపిస్తూ జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలోకళాకారులు కళాజాత నిర్వహించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే తమ ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. దోమల నియంత్రణ కోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు ఇంట్లోని ట్యాంకులు, కుండీలను వారానికి ఒక రోజు శుభ్రపర్చడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు. గృహాల్లో చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా శానిటరీ సిబ్బందికి అందించాలని సూచించారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగానికి ఎవరికి వారు బాధ్యతగా దూరం కావాలన్నారు. కార్యక్రమంలో వార్డు మలేరియా సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీ ప్రదీప్, మేస్త్రీ ధనాల వెంకటరమణ, కళాజాత టీం లీడర్ డేవిడ్ రాజ్, ఇతర కళాకారులు కుమారి, రాణి, సముద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఐక్యతకు భంగం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

సింథియా: ఎస్సీలను నాలుగు గ్రూపులుగా వర్గీకరించడం అనేది కేవలం ఎస్సీలను వంచించడం, దగా చేయడమేనని పారిశ్రామిక ప్రాంత మాలమహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు ధ్వజమెత్తారు. కాకరలోవ గ్రామం భీమా బాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గుడాల రాంబాబు అధ్యక్షత వహించిన సమావేశంలో రమాబాయ్ సంఘం ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల దళితుల్లో ఐక్యత దెబ్బతింటుందన్నారు. ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు శాస్త్రీయ విధానంలో కులం, మతం ఆధారంగా గణన చేసి జనాభా తేల్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీవరణకు వ్యతిరేకంగా విశాఖ నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో డిసెంబర్ 8న మాల మహానాడు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘ గౌరవాధ్యక్షుడు పునుకు రమణ, మాల నేతలు గుడాల ఈశ్వరరావు, సబ్బవరపు శ్రీను, హనుమంతరావు, యువీ రావ్, తంతటి సంపత్‌కుమార్, నడుపూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలి


చింతల్లోవ సచివాలయ అడ్మిన్ అనిల్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సింథియా: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అచ్చెంనాయుడులోవ, ములగాడ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఐ కార్యదర్శి కాంద్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్చెంనాయుడులోవ, ములగాడ టిడ్కో గృహాల వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామసచివాలయ అడ్మిన్ అనిల్‌ను సీపీఐ నాయకులు, కార్యకర్తలు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సత్యాంజనేయ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్లులేని వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బందులు తొలగే విధంగా ప్రభుత్వం దిగి వచ్చే వరకు సీపీఐ ఆధ్వర్యంలో టిడ్కో గృహాల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించినట్టు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాన్ని లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, గోపి, త్రినాథ్, జయ తదితరులు పాల్గొన్నారు.

● పొంచి ఉన్న ప్రమాదం


ఫోకస్

సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న ఇనుప కడ్డీలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రైల్వే స్టేషన్ ముందు రోడ్‌లో డ్రైనేజీపై వేసిన పలక ఇనుప కడ్డీలు వంగిపోయాయి. దీంతో అటుగా వెళ్లే పాదచారులు ఇనుప చువ్వల మధ్య ఇరుక్కు పోతున్నారు. ఎన్‌ఏడీ-గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్ నుంచి సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో డ్రైనేజీ ఆధునికీకరణ పనులు జరుగుతున్నప్పటికీ దీని గురించి మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో అయితే ప ఆ ఇనుప చువ్వల్లో పాదాలు దూరి ఇబ్బందులకు గురవుతున్నారని సమీప దుకాణాల వారు చెబుతున్నారు.

- విశాఖ విద్య

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

మల్కాపురం: మల్కాపురం విద్యుత్ ఉప కేంద్రం (సబ్ డివిజన్ కార్యాలయం) వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్టు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

సీ.జి.ఆర్.ఎఫ్ మరియు ఏపీఈపీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణతో పాటు సాంకేతిక సభ్యులు ఎస్.మసిలామణి, ఆర్థిక సమస్యలపై షేక్‌బాబర్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుని అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ డేకు ఏర్పాట్లు

సింథియా: నౌసేనబాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం-1లో మంగళవారం పాఠశాల 42వ వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగి తెలిపారు. 42వ వార్షిక స్పోర్ట్స్ డే సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఏం కష్టం వచ్చింది కొడుకా..

- కరెంట్ షాక్‌తో రెండేళ్ల కిందట భార్య మృతి
- ఏడాది కిందట ఉరిపోసుకుని పెద్దకుమారుడు..


తరుణ్ మృతదేహం


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆ కుటుంబాన్ని విధి వంచించింది. ఒక్కొక్కరినీ అర్ధాంతరంగా అనంతలోకాలకు తీసుకెళ్లింది. కుటుంబ పెద్దను ఒంటరిని చేసింది. రెండేళ్ల కిందట విద్యుత్ షాక్‌తో భార్య చనిపోయింది. ఏడాది కిందట పెద్దకుమారుడు ఉరి పోసుకుని మృతి చెందాడు. సరిగ్గా ఏడాది తిరక్క ముందే చేదోడు వాదోడుగా ఉన్న చిన్న కొడుకు కూడా అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆ తండ్రి రోదన మిన్నంటింది. ఇరుగు పొరుగువారు పెంటారావును ఓదార్చారు.

మల్కాపురం: అప్పటి వరకూ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపిన ఓ యువకుడు అంతలోనే అనంతలోకానికి వెళ్లి క్షోభ మిగిల్చాడు. తండ్రిని ఒంటరి చేసి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు... జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జాలరవీధికి చెందిన మోదు తరుణ్ (23) తండ్రి పెంటారావుతో కలిసి ఉంటున్నాడు. ఈ యువకుడు హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే సోమవారం సాయంత్రం వరకు సరదాగా గడిపాడు. ఆ తర్వాత తన గదిలోకి వెళ్లాడు. సమయం గడుస్తున్నా కుమారుడు గదిలో నుంచి రాపోవడంతో తలుపు కొట్టి పిలిచారు. స్పందన లేకపోవడంతో కిటికీ లోనుంచి చూడగా గదిలో హుక్కుకు ఉరి పోసుకుని కనిపించాడు. ఆ దృశ్యాన్ని చూసి బోరున విలపించాడు. ఏం కష్టం వచ్చింది కొడుకా అంటూ రోదించాడు. మల్కాపురం పోలీసులు వచ్చి మృతిపై ఆరా తీశారు. పూర్తి విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తామని సీఐ విద్యాసాగర్ వివరించారు.

హరహర మహాదేవ


పూజల్లో పాల్గొన్న భక్తులు


విశేష అలంకరణలో శివలింగం


పూజలందుకున్న సుసర్లకాలనీ చంద్రమౌళీశ్వర స్వామి

విశాఖ విద్య: కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకొని నియోజకవర్గంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ వద్ద గల ప్రమథ ఉమావిశ్వేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు.

- జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడాలేవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో కార్తీక పూజలు వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి. సూర్యనారాయణ, వైస్ చైర్మన్ పసాద్ రెడ్డి, కార్యదర్శి శంకరరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష శివప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీలోని పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో పంచామృతాలతో స్వామికి అభిషేకం జరపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్ఛాపు, శ్రీనివాసరాజు, హరిశంకర్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.
- అదేవిధంగా గోపాలపట్నం, చంద్రానగర్, నాగేంద్ర నగర్ కాలనీల్లోని శివాలయాల్లో పూజలు ఘనంగా జరిగాయి.

మల్కాపురం: కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాబ సమేత మల్లికార్జున స్వామికి ఆలయ అర్చకులు సుగంధ పుష్పాలు,విభూది, బిల్వపత్రాలతో అభిషేకించారు. అలాగే మల్కాపురం రెడ్డివీధి శివాలయం,ప్రకాష్‌నగర్,శ్రీహరిపురం,గణపతినగర్, పిలకవానిపాలెం ప్రాంతాల్లోని ఆలయాల్లో కార్తీక సోమవారాల పూజలు వైభవంగా నిర్వహించారు.


శివలింగానికి అభిషేకిస్తున్న భక్తులు

అంతా మా ఇష్టం!


రోడ్డుపైనే ఇటుక, ఇతర సామగ్రి

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీలో ఓ ఇంటి నిర్మాణ దారుడు రోడ్డును పూర్తిగా తన అవసరాలకు కోసం వినియోగిస్తున్నాడు. దీని వల్ల ఆదారిలో వెళ్లే వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గరవుతున్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్, ఇతర సామగ్రి రోడ్డుపై ఉంచి పనులు చేస్తున్నారు. కూటమి నాయకుడికి చెందిన భవనం కావడంతో జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పాటు భవన నిర్మాణం అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అంతా మా ఇష్టం అన్నట్టు నిర్మాణ దారుడు పనులు కొనసాగిస్తున్నాడు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.